నమస్తే తెలంగాణ
కరీంనగర్
5 | కరీంనగర్, ఆదివారం 26 జనవరి 2025 | KARIMNAGAR

గణతంత్ర వేడుకలకు ముస్తాబు

ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

పెద్దపల్లి, జనవరి 25(నమస్తే తెలంగాణ): నేటి గణతంత్ర వేడుకలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్లలోని పోలీస్ పరేడ్ మైదానాలు, పెద్దపల్లి సమీకృత కలెక్టరేట్‌లోని పరేడ్ మైదానాన్ని అందంగా ముస్తాబు చేశారు. ఉదయం ఆయా జిల్లాల కలెక్టర్లు జాతీయ పతాకాలను ఆవిష్కరించనున్నారు. అనంతరం గౌరవ వందనం స్వీకరించేందుకు మైదానాలను సిద్ధం చేశారు. స్థానిక ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అన్ని వర్గాల ప్రజలు పాల్గొనేలా ఏర్పాట్లు చేశారు.

ముస్తాబైన కరీంనగర్ పరేడ్ మైదానం

సునీల్‌రావు పచ్చి అవకాశవాది

ఏ పార్టీ అధికారంలో ఉంటే అందులోకి వెళ్తడు

పార్టీలు మారడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య

- ఆర్థికంగా బలపడడమే ఆయన లక్ష్యం
- బీజేపీలో చేరిన కరీంనగర్ మేయర్‌పై ఎమ్మెల్యే గంగుల నిప్పులు

కరీంనగర్, జనవరి 25 (నమస్తే తెలంగాణ) : సునీల్‌రావు పచ్చి అవకాశవాదని, ఏ పార్టీ అధికారంలో ఉంటే అందులో చేరడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య అని మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ తీవ్రస్థాయిలో విమర్శించారు. కేవలం ఆర్థికంగా, రాజకీయంగా బలపడడానికే పార్టీలు మారుతుంటాడని ధ్వజమెత్తారు. మేయర్ సునీల్‌రావు బీజేపీలో చేరడంపై నిప్పులు చెరిగారు. ఇలాంటి వాళ్లు ఎందరు పోయినా పార్టీ ఎప్పటికీ బలంగానే ఉంటుందని, స్వార్థపరులు పార్టీని వీడినా తమకు జరిగే నష్టం లేదని స్పష్టం చేశారు. శనివారం కరీంనగర్‌లో మీడియాతో మాట్లాడారు. పదేళ్లు బీఆర్ఎస్‌లో ఉండి, ఐదేళ్లు మేయర్ పదవి అనుభవించి, ఇప్పుడు అధికారం కోల్పోగానే బీజేపీ పంచన చేరుతున్నాడని విరుచుకుపడ్డారు. సునీల్‌రావు ఒక స్వార్థపరుడని, ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలో చేరడం, ఆ పార్టీ నాయకులను మభ్యపెట్టడం, నక్క వినయాలు ప్రదర్శించడం, రాజకీయంగా, ఆర్థికంగా లబ్ధి పొందడం ఆయన నైజమని స్పష్టం చేశారు. తమ పార్టీలో పదేండ్లు ఉండి, మేయర్ పదవి అనుభవించి, ఆర్థికంగా బలపడ్డాడని, అధికారం కోల్పోగానే ఇంకో పార్టీని ఎంచుకుంటున్నాడని, రేపు ఆ పార్టీ అధికారం కోల్పోతే మరో పార్టీకి వెళ్తాడని ఎద్దేవా చేశారు. తన పాత కేసులు తిరగతోడకుండా చూసుకునేందుకే బీజేపీ పంచన చేరుతున్నాడని విమర్శించారు. రేపు బీజేపీ అధికారం కోల్పోతే, ఆయన నమ్ముకున్న నాయకుడి పదవి పోతే తిరిగి వేరే పార్టీలో చేరడనే గ్యారంటీ లేదన్నారు. ఎంఐఎం అధికారంలోకి వస్తే ఆ పార్టీలోకి వెళ్లేందుకు కూడా వెనుకాడడని దుయ్యబట్టారు. తమ పార్టీలో ఇక ఇలాంటి నాయకులకు అవకాశం ఇవ్వకూడదని నిర్ణయించుకున్నామని స్పష్టం చేశారు. తమ నాయకుడు కేసీఆర్ ఎంతో మంది బలమైన నాయకులను తయారు చేశాడని, ఎందరో ఎమ్మెల్యేలు, మంత్రులుగా తయారై పరిపాలనా దక్షులుగా మారారని గుర్తు చేశారు. పార్టీ వదిలి వెళ్లిన వాళ్లంతా ఇప్పుడు కాలగర్భంలో కలిసి పోయారని చెప్పారు. సునీల్‌రావు లాంటి వెన్నుపోటు దారుల గురించి ముందే తెలిసి పోవడం చాలా మంచిదైందన్నారు. మేయర్ పదవి కోసం అక్కా, బావా అని సంబంధాలు కలుపుకొని నక్క వినినయాలు ప్రదర్శించి, పదవి రాగానే ప్రజల సంక్షేమాన్ని మరిచి రూ.కోట్లకు కోట్లు సంపాదించుకుని వెళ్లిపోవడం సునీల్‌రావుకే చెల్లిందని విరుచుకుపడ్డారు. ఇక నుంచి ఆయన వెంట పడక తప్పదని, ఆయనపై వచ్చిన ఆరోపణలన్నింటినీ వెలికి తీస్తామని, ఎక్కడి నుంచి డబ్బులు వచ్చాయో మొత్తం బయటపెడతామని స్పష్టం చేశారు.

దొడ్డిదారిన వచ్చినప్పడే అలర్ట్ చేశాం

సునీల్‌రావు తమ పార్టీలోకి దొడ్డిదారిలో వచ్చినప్పుడే క్యాడర్‌ను అలర్ట్ చేశామని గంగుల గుర్తు చేశారు. ఆయన తమ పార్టీలో చేరినప్పుడే ఏదో ఒక రోజు వెళ్లి పోతాడని అప్పుడే ఊహించామని చెప్పారు. ఇరవై ఏండ్లకుపైగా కాంగ్రెస్‌లో ఉన్నాడని, ఆ పార్టీ అధికారం కోల్పోగానే తమ పార్టీలోకి వచ్చాడని, ఇప్పుడు బీజేపీలోకి వెళ్లాడని, అక్కడైనా సరిగ్గా ఉండాలని సూచించారు. ఇరవై ముప్పై ఏండ్ల నుంచి బీజేపీలో ఉన్న నాయకులు, కార్యకర్తలను కాదని మళ్లీ మేయర్ కావాలనో, ఎమ్మెల్యే కావాలనో చూడకుండా అంకిత భావంతో పనిచేయాలని హితవు పలికారు. ముందుగా కాంగ్రెస్‌లోకి వెళ్లాలని ప్రయత్నించాడని, మంత్రి పొన్నం ప్రభాకర్ రిజెక్ట్ చేయడంతో బండి సంజయ్‌ని ఆశ్రయించాడని, బీజేపీలో చేరి పోలీసు కేసులు మాఫీ చేయించుకోవాలని, అవినీతి ఆరోపణలు తుడిచి వేసుకోవాలనేది సునీల్‌రావు ఆలోచనని అన్నారు. రాజకీయ భవిష్యత్తు కోసం పార్టీ మారుతున్నానని చెప్పిన ఆయన, తీరా బీజేపీ కండువా కప్పుకోగానే తనపై లేని పోని ఆరోపణలు చేస్తున్న తీరును గంగుల తప్పుబట్టారు. తాను ఏ తప్పు చేసినా, ఎలాంటి ఆరోపణలు వచ్చినా కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ చేతిలోనే సీబీఐ, ఈడీలు ఉంటాయని, ఎవరితో విచారణ చేయించినా తనకు అభ్యంతరం లేదని, దమ్ముంటే చేయించాలని సవాల్ విసిరారు. తనలాగే సునీల్ రావు కూడా విచారణకు సిద్ధం కావాలని సూచించారు. ఎందరి రక్తంతో సునీల్‌రావు ఇల్లు కట్టారో తమకు తెలుసని, ఆయనపై వచ్చిన ఆరోపణలు కొన్ని మా పార్టీ అధిష్టానం దృష్టికి వెళ్లాయని, ఇప్పుడిప్పుడు ఇంకా ఆరోపణలు వస్తున్నాయని, ఇప్పటి నుంచి ఆయన వెనకే పడతామని స్పష్టం చేశారు. సునీల్‌రావు లాంటి స్వార్థపరులు పార్టీని వీడడం వల్ల తమకు పట్టిన దరిద్రం పోయిందని, శని విరగడయ్యిందని అన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కేసీఆర్‌పై అభిమానం ఉన్నవాళ్లెవరూ వెళ్లరు

కేసీఆర్, తెలంగాణపై అభిమానం ఉన్నవాళ్లు ఎవరూ బీఆర్ఎస్‌ను వదిలి వెళ్లరు. పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత స్వలాభం కోసం చేరిన సునీల్‌రావు లాంటి వాళ్లు మాత్రమే పార్టీని వీడిపోతున్నరు. రాబోయే కాలంలో కరుడుగట్టిన బీఆర్ఎస్ వాదులకే ప్రాధాన్యత ఇస్తం. బీఆర్ఎస్ అంటే తెలంగాణ సెంటిమెంట్‌లో పుట్టిన పార్టీ. రాష్ట్రాన్ని సాధించి, అభివృద్ధి చేసిన ఉద్యమ పార్టీగా చూడాలి. అభివృద్ధి చేయడంతోపాటు రాష్ట్ర ప్రజల మనోభావాలను కాపాడుతున్నం. రేపు ఈ బాధ్యత తీసుకుంటం. తమకు మార్గనిర్దేశనం చేసే కేసీఆర్‌తోపాటు సత్తా ఉన్న నాయకులు కేటీఆర్, హరీశ్‌రావు ఉన్నరు. ఇక ముందు పార్టీకి విధేయత ఉన్న నాయకులను తయారు చేస్తం. వాళ్లకే ప్రాధాన్యత ఇస్తం. రాబోయే కాలంలో బీఆర్ఎస్‌ను మంచి పార్టీగా తీర్చిదిద్దుతం. మరోసారి అధికారంలోకి వస్తం.

- గంగుల కమలాకర్

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

కాంగ్రెస్ సర్కారు కక్షసాధింపు

- ఇతర పార్టీల నేతలను అణచివేయాలని చూస్తున్నది
- ఇప్పటికైనా ప్రభుత్వం తీరును మార్చుకోవాలి
- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

కరీంనగర్ కార్పొరేషన్, జనవరి 25 : కాంగ్రెస్ ప్రభుత్వం ఇతర పార్టీల నాయకులు, ప్రజలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతూ పాలన సాగిస్తున్నదని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ధ్వజమెత్తారు. శనివారం కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పెడగపల్లి సింగిల్ విండో చైర్మన్ రమణారావుతో కలిసి ఆయన మాట్లాడారు. ధర్మపురి నియోజకవర్గంలో 12 కో ఆపరేటివ్ సొసైటీలు ఉండగా ఆరింటిలో అవినీతి జరిగిందంటూ స్థానిక ఎమ్మెల్యే లక్ష్మణ్‌కుమార్ ఫిర్యాదు చేస్తే ఒకే రోజులో ప్రిన్సిపల్ సెక్రటరీ రిజిస్ట్రార్‌కు లేఖ రాయడం, అక్కడి నుంచి డీసీవో రావడం, వెంటనే విచారణ అధికారులను నియమించడం పూర్తి చేశారని తెలిపారు. అయితే, పదేళ్ల ఆడిట్‌ను ఇద్దరు అధికారులే వారం రోజుల్లోనే ఎలా పరిశీలిస్తారని ప్రశ్నించారు. సంఘాల్లో ఉన్న నాయకులు ఇతర పార్టీలకు పని చేశారన్న అక్కసుతో కక్ష సాధింపులకు దిగుతున్నారని దుయ్యబట్టారు. ఎలాంటి రికార్డులూ చూడకుండా డీసీవో షోకాజ్ నోటీసులు ఇవ్వడాన్ని హైకోర్టు తప్పు పట్టిందని, కేవలం రాజకీయంగా ఒత్తిళ్ల మేరకు జరిగిందని, ఇలా చేయడం సరికాదంటూ తీర్పు ఇచ్చిందన్నారు. దీనిని తాము స్వాగతిస్తున్నామని తెలిపారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం తన కక్ష సాధింపు తీరును మార్చుకోవాలని హితవు పలికారు.

ఓర్వలేకనే బురదజల్లే ప్రయత్నం

-సింగిల్ విండో చైర్మన్ రమణారావు

సంఘాల్లో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే తమపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని సింగిల్ విండో చైర్మన్ రమణారావు విమర్శించారు. తమ వద్ద పదేళ్ల నుంచి పూర్తిస్థాయిలో ఓచర్లు ఉన్నాయన్నారు. వీటిని కనీసం పరిశీలించకుండానే డీసీవో నోటీసులు ఇచ్చారని ఆరోపించారు. డీసీఓలు తమ జనరల్ బాడీ సమావేశాలకు రమ్మంటే కూడా రావడం లేదన్నారు. 19వేల చదరపు మీటర్ల భవన నిర్మాణానికి ₹3.50 కోట్ల వ్యయం అవుతుందన్న అంచనా వేసిన తాము ₹2.50 కోట్లతోనే పూర్తి చేశామని తెలిపారు. ఇందులో ₹1.87 కోట్ల అవినీతి జరిగిందని ఆరోపిస్తున్నారని, వీటికి సంబంధించి ఆయా సంస్థలకు చెల్లించిన రసీదులు ఉన్నాయన్నారు. ఇంత విశాలమైన భవనాన్ని ₹40 లక్షల్లోనే ఎవరైనా నిర్మిస్తారా..? అని ప్రశ్నించారు. తాము ఏమీ చేయకున్నా తప్పుడు అట్రాసిటీ కేసులు పెడుతున్నారని విమర్శించారు. కనీసం మానవ సంబంధాలు కూడా లేకుండా మాట్లాడితే తప్పు అనే విధంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు, మాజీ మేయర్ రవీందర్‌సింగ్, నాయకులు రఘువీర్ సింగ్, పెండ్యాల మహేశ్, గుంజపడుగు హరిప్రసాద్ పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థులకు ఉపకారవేతనాలు

కలెక్టరేట్, జనవరి 25 : జిల్లాలోని దివ్యాంగ విద్యార్థులకు ఉపకారవేతనాల పంపిణీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని మహిళా, శిశు, వికలాంగుల, వయోవృద్ధుల శాఖ సంక్షేమ అధికారి కె.సబితకుమారి తెలిపారు. ఇంటర్ ఆపై చదువుతున్న వారు 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఈ ఏడాది మార్చి 31లోగా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. కొత్తగా, గతంలో దరఖాస్తులు చేసుకున్న వారు కూడా పునరుద్ధరణ చేసుకునే అవకాశమున్నట్లు పేర్కొన్నారు. అంగవైకల్య విద్యార్థులు http;\\ telanganaepass.cgg. gov.in వెబ్‌సైట్‌లో తమ ధ్రువీకరణ పత్రాల జిరాక్స్‌లు అప్‌లోడ్ చేయాలని శనివారం విడుదల చేసిన ప్రకటనలో సూచించారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల

సొంత పాలసీ లేని కాంగ్రెస్ పాలన

- గ్రామ సభల పేరిట ప్రజల మధ్య చిచ్చు పెడుతున్నది
- ప్రజలను యాచకులుగా మారుస్తున్నరు
- పథకాల పేరుతో డబ్బులు వసూలు చేస్తున్నరు
- కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల ధ్వజం

కోరుట్ల, జనవరి 25 : కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామ సభల పేరుతో ప్రజల మధ్య చిచ్చు పెడుతున్నదని, సొంత పాలసీ లేకుండా పాలన సాగిస్తున్నదని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల ధ్వజమెత్తారు. కోరుట్ల పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంక్షేమ పథకాలకు లబ్ధిదారుల ఎంపిక సాకుతో ప్రజలను మరోసారి మోసం చేసేందుకు గ్రామ, వార్డు సభలను నిర్వహిస్తున్నదని మండిపడ్డారు. కాంగ్రెస్ మంత్రులు పథకాల అమలు తీరుపై తలా తోక లేకుండా ప్రకటనలు చేస్తున్నారని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే కొత్త నాటకానికి తెర లేపారన్నారు. బీఆర్ఎస్ హయాంలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజల వద్దకు పాలన తీసుకు వెళ్లారని, ఒక్కసారి కూడా దరఖాస్తుల పేరుతో ప్రజలను ఇబ్బందులు పెట్టిన దాఖలాలు లేవన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ సర్కార్ ఆరున్నర లక్షల మందికి రేషన్ కార్డులు అందజేసిందని, అవసరమైతే ప్రభుత్వ లెక్కలు చూసుకోవాలని సూచించారు. రాష్ట్ర మంత్రులు అవగాహనా రాహిత్యంతో మాట్లాడుతున్నారని, గత ప్రభుత్వంపై నిందలు వేయడమే పనిగా పెట్టుకున్నారని ధ్వజమెత్తారు. సంక్షేమ పథకాల అమలు పేరుతో ప్రజలను మభ్య పెడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తుందని ఆరోపించారు. పథకాల కోసం కాంగ్రెస్ నాయకులు డబ్బులు వసూలు చేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని, ఇల్లు ఇప్పిస్తామని ₹10 వేల వరకు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఎవరు కూడా డబ్బులు ఇవ్వవద్దని, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించే బాధ్యత తనదేనని భరోసా కల్పించారు. తెలంగాణ ప్రజలు శాసించి పథకాలను సాధించుకోవాలని, ఎవరి వద్దా మోకరిల్లి యాచించవద్దన్నారు. గ్రామ సభలు పార్టీ సభలుగా మారాయని, ప్రశ్నించే వారిపై రౌడీయిజం, గుండాయిజం ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో రైతు బంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు చీటి వెంకటరావు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్, పట్టణ మైనార్టీ అధ్యక్షుడు ఫహీం, నాయకులు అతిక్, మురళి, అన్వర్, సందయ్య, రాజ్‌కుమార్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల ఆవరణలో ఊడుస్తున్న విద్యార్థినులు

విద్యార్థులే స్వీపర్లు

- గణతంత్ర ఏర్పాట్లకు చీపుర్లు పట్టిన విద్యార్థులు

జగిత్యాల, జనవరి 25 : జగిత్యాల జిల్లా కేంద్రంలోని మిషన్ కాంపౌండ్‌లో గల సీఎస్ఐ ప్రాథమిక పాఠశాల ఆవరణలో శనివారం విద్యార్థులతో చీపుర్లు పట్టించి ఊడిపిస్తూ చెత్తను తీసివేయించారు. ఆదివారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా పాఠశాల పరిసర ప్రాంతాల్లో శుభ్రం చేయాలని విద్యార్థులకు హెచ్ఎం చెప్పడంతో, అక్కడ ఉన్న చెత్తను ఊడుస్తూ ఎత్తి పక్కన పడేశారు. అదేవిధంగా పాఠశాల పరిసర ప్రాంతాల్లో అసాంఘిక కార్యక్రమాలు చోటు చేసుకోవడంతో హెచ్ఎంతో మాట్లాడగా, ఈ ప్రాంతంలో ఇలా జరుగుతుందని, దానికి తాము ఏం చేయాలని ఎదురు ప్రశ్నించారు. దీనిపై డీఈవో రాములును సంప్రదించగా, జగిత్యాల ఎంఈవోను ఘటనా స్థలానికి పంపించి వివరాలు సేకరించి వారిపై చర్యలు తీసుకుంటామని సమాధానమిచ్చారు.

మండలానికి ఒక్క ఊరే!

- నాలుగు పథకాల అమలులో మారిన ప్రభుత్వ నిర్ణయం
- పైలెట్ గ్రామాల్లో అధికారుల తంటాలు
- రాత్రి పూట సర్వే

గణతంత్ర దినోత్సవం రోజు నాలుగు పథకాలను ప్రారంభిస్తామని గొప్పలు చెప్పిన ప్రభుత్వం, అమలులో యూటర్న్ తీసుకున్నది. మండలానికి ఒక్క గ్రామాన్ని ఎంపిక చేసి, అమలు చేయాలని నిర్ణయించింది. దీంతో ఆ గ్రామాల ఎంపిక, జాబితాల వడపోత అధికారులకు తలనొప్పిగా మారింది. రాత్రికి రాత్రే లబ్ధిదారులను ఎంపిక చేయాల్సిన దుస్థితి ఏర్పడింది.

కమాన్‌పూర్ మండలం రొంపికుంటలో రాత్రి పూట సర్వే నిర్వహిస్తున్న అధికారులు

కరీంనగర్, జనవరి 25 (నమస్తే తెలంగాణ) : గణతంత్ర దినోత్సవం సందర్భంగా రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఆహార భద్రత కార్డుల పేరిట నాలుగు పథకాలను ప్రారంభిస్తున్నట్టు ప్రభుత్వం చెప్పింది. అందకు అనుగుణంగా అధికారులతో సర్వేలు చేయించింది. అంతే కాకుండా ఈ నెల 21 నుంచి 24 వరకు గ్రామ, వార్డు సభలు నిర్వహించింది. అధికారులు ఆయా గ్రామసభల్లో అర్హుల జాబితాను కూడా ప్రదర్శించారు. అయితే, ప్రతి గ్రామసభలో అర్హులను ఎంపిక చేయలేదని నిరసనలు వ్యక్తం కాగా, అధికారులు కొత్తగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దాంతో ప్రజలు పెద్ద సంఖ్యలో దరఖాస్తులు చేసుకున్నారు. ఈ నెల 26 నుంచి పథకాలను ప్రారంభిస్తున్నట్టు చెప్పిన నేపథ్యంలో అన్ని గ్రామాల్లో లబ్ధిదారులకు ఒకేసారి లబ్ధి జరుగుతుందని అందరు భావించారు. కానీ, ప్రభుత్వం ఈ విషయంలో తన నిర్ణయాన్ని మార్చుకున్నది. ఇప్పుడు మండలానికి ఒక గ్రామాన్ని మాత్రమే ఎంపిక చేసి, నాలుగు పథకాలను అమలు చేసేందుకు సిద్ధమై ఆదేశాలు ఇచ్చింది. దీంతో అధికారులు రంగంలోకి దిగి, మండలానికో గ్రామాన్ని ఎంపిక చేశారు. అయితే కొత్తగా వచ్చిన దరఖాస్తులను పరిశీలిస్తున్నారు. సమయం సరిపోకపోవడంతో శనివారం రాత్రి ఇంటింటా తిరుగుతూ సర్వే చేశారు. శనివారం రాత్రి జగిత్యాల కలెక్టర్ సత్యప్రసాద్ జగిత్యాల రూరల్ మండలం కండ్లపెల్లి, మేడిపల్లి మండలం గుండ్లపల్లిలో సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే వివరాలను, జాబితాలను పరిశీలించారు. అయితే కొన్నిచోట్ల గ్రామ పంచాయతీ కార్యాలయాలు, కాంగ్రెస్ నాయకుల ఇండ్లలో కూర్చొని అధికారులు సర్వేను మమ అనిపించినట్టు తెలుస్తున్నది.

కమ్ముకున్న పొగమంచు

వారం నుంచి చలి తీవ్రత పెరిగింది. కనిష్ఠ ఉష్ణోగ్రతలు తగ్గిపోతుండగా, వణికిస్తున్నది. మరోవైపు పొగమంచు కమ్ముకుంటున్నది. ఉదయం వేళ ఎక్కడ చూసినా మంచు దుప్పటి పరుచుకుంటున్నది. దీంతో వాహనదారులు రోడ్లపై ఇబ్బందులు పడుతున్నారు. లైట్లు వేసుకొని వెళ్తున్నారు.

- ఓదెల, జనవరి 25

ముగిసిన క్రీడాపోటీలు

కొత్తపల్లి, జనవరి 25 : కరీంనగర్ జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో రెండు రోజుల నుంచి జరుగుతున్న ఉమ్మడి కరీంనగర్ జిల్లా పాలిటెక్నిక్ కళాశాలల స్పోర్ట్స్, గేమ్స్ మీట్ శనివారం సాయంత్రం ఘనంగా ముగిశాయి. బాలుర విభాగంలో ఓవరాల్ విజేతగా సిరిసిల్లకు చెందిన ఎస్ఆర్ఆర్ఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు నిలువగా, మహిళా విభాగంలో ఓవరాల్ చాంపియన్‌గా కరీంనగర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు నిలిచారు. అనంతరం పలు క్రీడాపోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డీ శోభారాణి, పలు విభాగాల అధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

హుజూరాబాద్ యువకుడికి వరల్డ్ బుక్ అవార్డు

హుజూరాబాద్ టౌన్, జనవరి 25: అతిపిన్న వయసులోనే లవ్‌స్ లవ్ అనే పుస్తకాన్ని రాసి పట్టణానికి చెందిన వడ్లూరి వేదార్థ వరల్డ్ బుక్, మహాత్మా గాంధీ నేషనల్ అవార్డులను అందుకున్నాడు. హుజూరాబాద్ మండలం పెద్ద పాపయ్యపల్లి గ్రామానికి చెందిన వడ్లూరి సుదర్శన్ కుమారుడు వేదార్థ, ఎస్సార్ కాలేజీలో బీటెక్ ద్వితీయ సంవత్సరం అభ్యసిస్తూ పట్టణంలోనే ఉంటున్నాడు. యువత మంచి మార్గంలో నడిచేలా మార్గదర్శనం చేస్తూ ఇంగ్లిష్ భాషలో కవితల రూపంలో పుస్తకం రచించాడు. దేశంలోనే అతి చిన్నవయసులో మంచి పుస్తకం రాసినందుకు వరల్డ్ బుక్ రికార్డ్స్ ప్రతినిధులు ఈ నెల 19న రాజస్థాన్ రాష్ట్రం జైపూర్‌లో అవార్డు అందజేశారు. ఇటీవల ఎంఎస్ఎంఈ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ నేషనల్ అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వేదార్థకు అవార్డు రావడంపై పెదనాన్న మున్సిపల్ మాజీ చైర్మన్ వడ్లూరి విజయ్ కుమార్‌తో పాటు పలువురు హర్షం వ్యక్తం చేశారు.